(తెలుగు కళా సమితి న్యూజెర్సీ) రాజాలక్ష్మి ఫౌండేషన్ వారి కథల పోటీలో రూ. 500/-లు బహుమతి గెలుచుకున్న కథ

# మహాశయా

– వల్లూరు శివప్రసాద్

యాదృచ్ఛికంగా పలుమార్లు తారసపడిన ఒకానొక అపరిచితుడి సమక్షంలోకి అవసరం మనల్ని లాక్కు వెళ్ళటం విచిత్రంగానే అనిపించవచ్చు. కాని నా విషయంలో అలానే జరిగింది. ఏయే సందర్భాలలో అతడు తారసపడిందీ చెప్పిన తర్వాత చివరి కలయిక గురించి చెప్పటం సమంజసం. అతడి గురించి ఇలా ఎందుకు చెప్పాల్సి వచ్చిందో కూడా అప్పుడే మీకు తెలిసేది.

ఆదివారం. ఉదయం ఆట సినిమా టికెట్ బుకింగ్ దగ్గర క్యూ తొక్కిసలాటగా వుంది. నా ముందు నలుగురైదుగురికి మించి లేరు.

టికెట్ దొరకొచ్చునని ఉప్పొంగుతున్న ఆశ ఒక్కసారిగా బుకింగ్ తలుపు ధఢేలుమని మూసుకోవటంతో చల్లారిపోయింది. క్యూ నిరాశగా పలచబడుతున్నది.

"ఆరు పది...ఆరు పది" ఎవరిదో గొంతు చెవి దగ్గర గుసగుసలాడుతున్నట్లనిపించింది.

చూడగానే అర్థమయింది. బ్లాక్‌లో టిక్కట్లు అమ్ముతున్నాడు. నలు



గురూ కొనటానికి సిద్ధమవుతున్నంతలో ఒకతను గభాల్న వాడి చొక్కా కాలరు దొరకబుచ్చుకున్నాడు.

"రేయ్! బ్లాక్ టిక్కట్లమ్ముతావురా! ఎక్కడివి నీకివి. పద నీ సంగతి తేలుస్తా!" అతన్ని బరబరా థియేటర్‌లోపలకు ఈడ్చుకు పోతున్నాడు.

అతని మొండి ధైర్యం నన్నాశ్చర్యపరిచింది. థియేటర్ వాళ్ళకు రౌడీ ముఠాలతో ఇలాంటి విషయాల్లో లాలూచీ లుంటాయన్నది జగమెరిగిన సత్యం.

"ఎవరయ్యా మేనేజర్! నీడికిన్ని టిక్కెట్లు ఎక్కడివి. మీరే అమ్మిస్తున్నారని కేసు పెడతాను" ఆఫీసు ముందు కేకలు పెడుతున్నాడు.

లోపల్నుంచీ మేనేజర్ కాబోలు వచ్చాడు.

"రేయ్! ఎన్నిసార్లు చెప్పినా బుద్ధి

రాదు నీకు" రెండు తగిలించాడు. మేనేజరలా కొట్టడంలో చాతుర్యమే చూపాడో లేక తినేవాడికని అలవాటైనవో ఏమోగాని టిక్కెట్లమ్మే వాడి ముఖంలో బాధ లేదు. కాలరు పట్టుకున్నతని కేసి గుడ్లురిమి చూస్తు న్నాడు.

"టిక్కెట్లు అసలు ధరకు తలోటి ఇవ్వు. లేదా పోలీస్ స్టేషన్‌కు ఈడ్చుకు పోతాను, రాస్కెల్!" అరిచాడు అతను.

"ఊ! ఇవ్వరా తలోటీ!" మేనేజర్ గద్దించాడు.

అలా పంపిణీ జరిగిన టిక్కెట్లలో నాకూ ఒకటి దక్కింది. చివరి టిక్కెట్టు అతను తీసుకుని ఆరు రూపాయలు చేతిలో వుంచాడు.

థియేటర్‌లో ఇద్దరం ప్రక్క ప్రక్క సీట్లలో కూర్చున్నాం. నాకు అతనంటే ఎంతో గౌరవం కలిగింది. ఈ రోజుల్లో పది మంది కోసం అంతటి సాహసం, తెగింపు ఎందరు చూపుతారు!

"మీరు చేసింది మంచి పనే! రౌడీ మూక ఒకటై మిమ్మల్ని ఏమన్నా చేస్తే మీకు సాయం ఎవరు నిలబడతారు" అన్నాను విశ్రాంతి సమయంలో.

"ఇలాంటి నీతిమాలిన వెధవల్ని స్పేర్ చెయ్యకూడదండీ! ఆ క్యూలో నాకో, మీకో దక్కాల్సిన టిక్కెట్ వాడు వనకే లాభానికి అమ్మి సొమ్ము చేసుకొంటాడా!" అన్నాడు ఆవేశంగా. సినిమా మొదలైంది.

* * *

బస్ రద్దీగా వుంది. టిక్కెట్లు చక చకా కొడ్తున్నాడు కండక్టర్.

మునిసిపల్ ఆఫీసుకి నేనే రెండ్రూపాయలిచ్చాను. రూపాయి పావలా టిక్కెట్లిచ్చి పావలా చిల్లర ఇవ్వలేదు.

నా ప్రక్కతను అదే స్టాప్ అడిగాడు. టిక్కెట్టిచ్చాడతను.

"పావలా ఇవ్వలేదు" కంఠం కంగుమంది.

అప్పుడు చూశాను. అతనే అతను. సినిమా హాలు దగ్గర తారసపడిన వ్యక్తి. చిల్లర దిగేటప్పుడు అడిగి తీసుకోమన్నాడు కండక్టర్. దిగాల్సిన స్టేజి దగ్గర పడుతున్నది.

"కండక్టర్! పావలా చిల్లర!" గుర్తు చేశాడతను.

"మార్చుకు రావాలండీ!... పదులూ పావలాలూ ఎందరికని ఇవ్వగలను" అన్నాడు చిల్లర లేదన్నట్టు.

"మీ సంచిలో చిల్లర గలగల లాడుతున్నది. అతి తెలివి చూపకండి" కరుగ్గా అన్నాడతను.

కండక్టర్ సంచిలో చేయిపెట్టి తడిమాడు. "మీ దగ్గర పావలా వుందా!" అడిగాడు అర్థరూపాయి తీస్తూ.

"ఇటివ్వండి. నీరికో పావలా ఇవ్వాలి గదా! నేనిస్తాను" అంటూనే కండక్టర్ చేతిలో అర్థరూపాయి గుంజుకున్నాడు.

బస్ ఆగింది. ఇద్దరం దిగాం.

"ఇదిగోండి మీ పావలా! చిల్లర కాజేయటం మరిగారు. డ్యూటీ దిగే సరికి పాతికో పరకో మిగుల్చుకోవాలన్న ఆశ. నీతిలేని కక్కుర్తి మనుషులు" పావలా బిళ్ళ నా చేతి కందిస్తూ చకచకా వెళ్ళిపోయాడు.

కాసేపతనితో ముచ్చటిస్తే బాగుండునని పించిందిగాని అతను హడావిడిగా వెళ్ళిపోయాడు.

ఒక సాయంత్రం ఫ్యాన్సీ షాపులో వస్తువులు కొంటున్నాను.

"ముప్పై ఎనిమిది ఇవ్వండి సార్!" షాపతను ఏదో ప్యాకేజి అందిస్తూ అన్నాడు.

"రూపాయి ఎక్కువెందుకు? ఇన్‌క్లూజివ్ ఆఫ్ ఆల్ టాక్సెస్ అనుంటే" నిలదీస్తున్నాడెవరో.

అప్పుడు చూశానుగదా! ఇంకెవరు! ఈ కాలంలో అన్ని చోట్లా వుండాల్సిన వాడు! అతనే!

"టర్నోవర్ టాక్సు వుంది గదండీ!" అన్నాడు షాపతను తెలివిగా.

"మీ టర్నోవర్ ఎంత! ప్రభుత్వానికి ఎంత చూపిస్తున్నారు. ఎంత టాక్స్ కట్టారు! ఏదో మీ రిపోర్టు ఇలా ఇవ్వండి."

షాపతను కంగుతిన్నాడు. ఇంత ధైర్యంగా అతను నిలదీస్తాడనుకోలేదు. వాదన పెంచటం తన వ్యాపారానికి మంచిది కాదనుకున్నాడేమో! ప్యాకెట్ మీదున్న ధరకే ఇచ్చాడు.

"చూశారు గదండీ! వ్యాపారిగా అతనికొచ్చే మార్జిన్‌తో తృప్తి పడలేదు. నిజాయితీ లేని మనిషి అందినంత అన్యాయంగా దోచుకోవాలనే..." అన్నాడు షాపునుండి బయటకు నడుస్తున్న నాతో.

అప్పటికే అతనంటే నాకెంతో గౌరవం, భక్తి ఏర్పడ్డాయి.

"అంతా మీలా ఆలోచించి ప్రతి ఘటిస్తే ఈ దేశం ఎంతో బాగుపడుతుంది" అన్నాను బస్ స్టాప్‌కేసి నడుస్తూ ప్రశంసాపూర్వకంగా.

"ఛలేవారే! ఈ కుళ్ళు రాజకీయాలు, అవినీతి రాజకీయ నాయకులూ ఇలా వర్థిల్లుతున్నంత కాలం ఈ దేశం బాగుపడదు. లాల్‌బహదూర్ శాస్త్రిలాంటి నిజాయితీ వున్న నాయకుణ్ణి అప్పటికీ ఇప్పటికీ ఒక్కణ్ణి చూపండి చాలు" ఉద్వేగంగా చెప్తూ పోతున్నాడతను.

అంతలో బస్ వచ్చింది. ఎక్కేడతను. ఆ తర్వాత కొద్ది నెలలు అతను తారసపడ్లేదు. అయినా అతన్ని నేను మర్చిపోలేక పోయాను.

బ్యాంక్ ఋణ సహాయంతో చిన్న ఇల్లొకటి ఏర్పాటు చేసుకోవాలన్న అభిలాషతో ప్లాన్ అప్రూవల్‌కి మునిసిపాలిటీలో దాఖలు చేస్తున్నప్పుడు సదాశివం సిఫారసు లేఖ ఒకటి ఇచ్చాడు.

ఎకాఎకి అది తీసుకుని ప్లాను దాఖలు చేసేందుకు వెళ్ళి చూద్దునుగదా, ఆ సీటులో వున్నది నేనింత దాకా చెప్తున్న ఆదర్శమూర్తే! ఎంతో ఆశ్చర్యం, [illegible]ం కలిగింది. నా ముఖం అ[illegible]మాత్రం జ్ఞాపకం తగిలినట్లు లేదు.

ప్లాన్ దాఖలుపరచిన తర్వాత కాఫీకి కేంటిన్‌లోకి వచ్చాం.

అతను గతంలో నాకు తారసపడిన సంఘటనలు ఒక్కొక్కటిగా గుర్తుచేసి అతనిపట్ల నాకున్న అభిమానాన్ని వ్యక్తం చేసేందుకు ఉబలాట పడసాగేను.

"సదాశివం ఏం చెప్పేడు" అడిగాడు కాఫీ సిప్‌చేస్తూ.

"అంతా మీరే చూసుకుంటారని చెప్పాడు."

"సరే! ప్లింత్ ఏరియాని బట్టి డెవలప్‌మెంట్ ఛార్జీలు వగైరాలు ఇంతని మున్సిపాలిటీకి అఫిషియల్‌గా చెల్లించాలి. అనఫిషియల్‌గా అడుగుకి మూడు రూపాయలు ఇవ్వాలి."

"అనఫిషియల్ అంటే?" అడిగాను ఆశ్చర్యంగా.

"ఎలాంటి రశీదూ ఇవ్వకుండానే మీరు ఇచ్చింది మా ఆఫీసు వాళ్ళంతలా కాస్త పంచుకునేది" ఈ మాత్రం తెలీదా అన్నట్లు నవ్వేడు.

ఒక్కసారిగా నా కాళ్ళ క్రింద భూమి కంపించినట్లయింది.

ఇరవై ఒకటవ శతాబ్దపు ఆత్మాధునిక మానవుడు నా కళ్ళముందు సాక్షాత్కరించినట్లనిపించింది.

తన చుట్టూ అంతా నీతి, నిజాయితీలేని మనుషులే. ప్రతివాడూ అన్యాయంగా తనను దోచుకోవాలనుకునేవాడే. క్రూర మృగాల మధ్య ప్రాణాంతకంగా బ్రతుకుతున్న సాధుజీవి తనొక్కడే!

తనను తాను శోధించుకోలేని ద్వంద్వదృష్టి ఈ 21వ శతాబ్దపు ఆత్మాధునిక అవలక్షణం కాబోలు!

తెలుగు కళాసమితి మ్యాబర్స్-రాజ్యలక్ష్మి ఫౌండేషన్‌వారికి కార్టూన పోటీలో బహుమతి పొందిన కార్టూన్

